క్లుప్తంగా

ప్లాస్టిక్ వినియోగాన్ని నిషేధించాలని ర్యాలీ



ప్లాస్టిక్ వినియోగాన్ని నిషేధించాలని ర్యాలీ చేస్తున్న జీవీఎంసీ సిబ్బంది, విద్యార్థులు

సింథియా: ప్లాస్టిక్ వినియోగాన్ని ప్రజలంతా స్వచ్ఛందంగా విరమించుకోవాలని కోరుతూ జీవీఎంసీ 40, 63వ వార్డులో శానిటరీ ఇన్‌స్పెక్టర్లు, ఇతర జీవీఎంసీ సిబ్బంది, విద్యార్థుల కలిసి ర్యాలీ నిర్వహించారు. శానిటరీ ఇన్‌స్పెక్టర్ రమేష్ మాట్లాడుతూ ప్రజలంతా సహకరిస్తేనే ప్లాస్టిక్ భూతాన్ని నిర్మూలన చేయగలమని, ప్లాస్టిక్ వ్యర్థాల కారణంగా పర్యావరణానికి ముప్పు వాటిల్లుతుందన్నారు. పేరుకుపోతున్న ప్లాస్టిక్ వ్యర్థాలను ఆహార పదార్థాలతో కలిపి తినడం వల్ల మూగజీవాలు మృత్యువాతపడుతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. వ్యాపారులెవరైనా నిబంధనలను అతిక్రమించి ప్లాస్టిక్ కవర్లు వినియోగిస్తే తగిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ప్లాస్టిక్ కవర్ల స్థానంలో క్లాత్, నార సంచులు వినియోగించాలని సూచించారు. కార్యక్రమంలో పారిశుధ్య సిబ్బంది పాల్గొన్నారు.

గోపాలపట్నం సీఐ అప్పారావు బాధ్యతల స్వీకరణ



విశాఖ విద్య: గోపాలపట్నం సర్కిల్ ఇన్‌స్పెక్టర్‌గా నియమితులైన గొలగాని అప్పారావు శుక్రవారం బాధ్యతలు చేపట్టారు. ఇప్పటి వరకు ఇక్కడ సీఐగా పనిచేస్తున్న కె. సురేష్‌ను కమిషనరేట్‌లోని సోషల్ మీడియా సెల్‌కు బదిలీ చేయగా,అక్కడ పనిచేస్తున్న అప్పారావుకు గోపాలపట్నంలో పోస్టింగ్ ఇస్తూ నగర పోలీసు కమిషనర్ ఉత్తర్వులు జారీ చేశారు. బాధ్యతలు చేపట్టిన సీఐ అప్పారావుకు స్టేషన్ సిబ్బంది స్వాగతం పలికారు. అనంతరం సీఐ అప్పారావు స్థానిక ఎమ్మెల్యే గణబాబును మర్యాదపూర్వకంగా కలిశారు.

కుటుంబ సభ్యుల చెంతకు తప్పిపోయిన మహిళ

విశాఖ విద్య: గోపాలపట్నం స్టేషన్‌లో పరిధిలో తప్పిపోయిన మహిళను పోలీసులు శుక్రవారం కుటుంబం చెంతకు చేర్చారు. ఎస్ఐ అప్పలనాయుడు తెలిపిన వివరాలు.. సింహాచలం దగ్గర విజనగిరిపాలెంకు చెందిన నెక్కాలి అనురాధ కొద్దిగా మతిస్థిమితం లేక ఇబ్బంది పడుతోంది. ఆ మె ఈ నెల 28 మధ్యాహ్నం సుమారు మూడు గంటల సమయంలో విజనగిరిపాలెం నుంచి తప్పిపోయిందని వెల్లడించారు.అనురాధ తమ్ముడు పవన్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు దర్యాప్తు చేసినట్టు వెల్లడించారు. శుక్రవారం ఆమె ఆచూకీ కనుగొని కుటుంబ సభ్యులకు అప్పగించారు.

వైభవంగా మహా రుద్రాభిషేకం



పూజలు నిర్వహిస్తున్న అర్చకులు

విశాఖ విద్య: జీవీఎంసీ 90వ వార్డు గవరవీధి గౌరీ సంఘం ఆధ్వర్యంలో గౌరీ పరమేశ్వరుల మహోత్సవాలు అట్టహాసంగా నిర్వహిస్తున్నారు. దీనిలో భాగంగా శుక్రవారం గౌరీ పరమేశ్వరులకు మహా రుద్రాభిషేకం నిర్వహించారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు. హాజరైన భక్తుల పేరుతో అర్చకులు పూజలు నిర్వహించి తీర్థ ప్రసాదాలు పంపిణీ చేశారు.

బిక్కు బిక్కు.. ఎవరు దిక్కు!

ఆ వార్డులో ప్రజలు అవస్థల నడుమ జీవనం సాగిస్తున్నారు. సాయంత్రం అయితే భయపడుతున్నారు. వానొస్తే వణుకుతున్నారు. రోడ్లు అస్తవ్యస్తంగా ఉండడంతో రాకపోకలకు ఇబ్బంది పడుతున్నారు. కొండవాలు ప్రాంతాల ప్రజలు బిక్కుబిక్కుమంటూ జీవనం సాగిస్తున్నారు. మొత్తంగా మౌలిక వసతులు లేక 63వ వార్డులోని ప్రజలు నిత్యం సతమతమవుతున్నారు. - సింథియా



- వెలగని వీధిదీపాలు.. అంధకారంలో ప్రజలు
- రక్షణ గోడలు లేక భయాందోళనలో కొండవాలు వాసులు
- అధ్వానంగా రహదారులు
- 63వ వార్డులో కానరాని మౌలిక వసతులు



రక్షణ గోడలు లేని క్రాంతినగర్ కొండవాలు ప్రాంతం

అవస్థలమయం

కొండవాలు ప్రాంతాల్లోని ప్రజలు బతుకుజీవుడా అంటూ కాలం వెళ్లదీస్తున్నా ప్రజాప్రతినిధులు అటు తొంగిచూసిన పాపాన పోలేదు. వర్షాలు వచ్చినప్పుడు హడావుడి చేయడమే తప్పా సౌకర్యాలు కల్పించడం లేదని ప్రజలు వాపోతున్నారు.

ఆశలు.. అడియాశలు

కూటమి ప్రభుత్వం వస్తే మేలు జరుగుతుందని భావించిన తమకు అవస్థలే మిగిలాయని ప్రజలు వాపోతున్నారు. మౌలిక వసతుల కల్పనపై దృష్టి సారించాల్సిన ప్రజాప్రతినిధులు నిద్ర నటిస్తున్నారని ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

జీవీఎంసీ 63వ వార్డులో అనేక సమస్యలు ప్రజలను పట్టిపీడిస్తున్నాయి. ముఖ్యంగా డ్రైనేజీలు, వీధిదీపాలు, రోడ్లు, రక్షణ గోడలు వంటి సమస్యలతో ప్రజలు సతమతమవుతున్నారు. కొండవాలు ప్రాంతాలైన కాకరలోవ, చింతల్లోవ, క్రాంతినగర్ వంటి ప్రాంతాల్లో వానొస్తే ఎప్పుడూ ఏ ప్రమాదం ముంచుకొస్తుందోనని ప్రజలు బిక్కు బిక్కుమంటూ జీవనం సాగిస్తున్నారు. దానికి తోడు వీధిలైట్లు లేక ప్రాణాలు అరచేతిలో పెట్టుకుని కాలం వెల్లదీస్తున్నారు.

చిల్లర దొంగల హల్‌చల్

వీధిదీపాలు లేకపోవడంతో చిల్లర దొంగతనాలు పెరిగాయి. రాత్రిపూట బడ్డీలు, చిరుదుకాణాల్లో అందిన కాడికి దోచుకుపోతున్నారు. దీంతో తాము నష్టపోతున్నామని చిరువ్యాపారులు ఆవేదన చెందుతున్నారు.



రోడ్డు మలుపులో వేసిన భవన నిర్మాణ సామగ్రి

రోడ్డే వ్యాపార కేంద్రాలు

వార్డులో భవన నిర్మాణ సామగ్రి విక్రయించే వ్యాపారులు రెచ్చిపోతున్నారు. భవన నిర్మాణానికి కావాల్సిన ఇసుక, పిక్క, ఇటుక వంటి మెటీరియల్‌ను రోడ్లపై డంపింగ్ చేసి దర్జాగా వ్యాపారం సాగిస్తున్నారు. వారి ఆగడాలకు చెక్ పెట్టాల్సిన అధికారులు కూటమి నాయకుల ఒత్తిడితో తలొగ్గుతున్నారన్న విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. ట్రాఫిక్ స్టాపర్లను సైతం వ్యాపారులు వాడుకుంటున్నారంటే పరిస్థితి ఏ స్థాయిలో ఉందో అర్థం చేసుకోవచ్చు.

చీకట్లో సంచారం

జీవీఎంసీ 63వ వార్డు క్రాంతినగర్ నుంచి ఇటు మల్కాపురం పోలీస్‌స్టేషన్, అటు యారాడ మార్గాల వైపు వెళ్లాలంటే ప్రజలు భయాందోళన చెందుతున్నారు. క్రాంతినగర్‌తో పాటు సింధియా నుంచి మల్కాపురం వరకు ఉన్న ప్రధాన రహదారిలో వీధిలైట్లు వెలగక నిత్యం అనేక ప్రమాదాలు జరుగుతున్నాయి. అంధకారంలో ప్రయాణానికి తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. మరికొందరు టార్చిలైట్ల వెలుగుతో రాకపోకలు సాగిస్తున్నాయి. విషకీటకాలు, పాముల సంచారంతో చీకటి పడిన తర్వాత ఈ మార్గంలో ప్రయాణించాలంటే పాదచారులు భయపడే పరిస్థితి నెలకొంది.



అంధకారంలో మల్కాపురం పోలీస్‌స్టేషన్ నుంచి చింతల్లోవ వెళ్లే మార్గం

వానొస్తే కునుకు ఉండదు



సాధారణ రోజుల్లో ఎలా ఉన్నా వర్షం కురిసినా.. తుపాను హెచ్చరికలు జారీ చేసినా కొండవాలు ప్రాంతాల్లో ఉండే మాలాంటి వాళ్లకు మాత్రం కంటి మీద కునుకు ఉండడం లేదు. విషసర్పాలు ఇళ్లలోకి చేరడం, వర్షపునీరు లోనికి రావడంతో అవస్థలు పడుతున్నాం. బండరాళ్లు దొర్లి వచ్చి ఎక్కడ ఇళ్లమీద పడతాయోనన్న భయం వెంటాడుతుంది. ప్రభుత్వం చొరవ తీసుకుని రక్షణ గోడలు ఏర్పాటు చేయాలి.

– పెంటారావు, చింతల్లోవ

అంధకారంతో అవస్థలు

వార్డులో వీధిదీపాలు లేక నానా ఇబ్బందులు పడుతున్నాం. చీకట్లో ప్రయాణించాలంటే భయంగా ఉంది.నెలల తరబడి ఇదే పరిస్థితి ఉండడంతో చీకటి పడితే బయటకు రావాలంటనేనే భయమేస్తోంది. పలుమార్లు విద్యుత్ అధికారులకు విన్నవించినా ఫలితం మాత్రం శూన్యం. వీధిదీపాలు నిత్యం వెలిగేలా చర్యలు చేపట్టాలి.



– రవి, కాకరలోవ

విద్యార్థులకు తప్పని ఫీట్లు

ఫోకస్

- ఆర్టీసీ బస్సుల్లో అవస్థల ప్రయాణం
- అదనపు సర్వీసులు నడపాలని విద్యార్థుల డిమాండ్



శ్రీహరిపురం బస్టాప్ వద్ద బస్సు ఎక్కలేక ఉండిపోయిన విద్యార్థులు

మల్కాపురం: ఆ మార్గంలో ప్రయాణించే విద్యార్థులు అవస్థలు పడుతున్నారు. సరిపడా బస్సులు లేక సమయానికి పాఠశాలలు, కళాశాలలకు చేరుకోలేక పోతున్నారు. నిత్యం ఫీట్ల మధ్య రాకపోకలు సాగిస్తున్నారు. మరి కొంతమంది బస్సుల్లో విపరీతమైన రద్దీ ఉండడంతో ఎక్క లేక ఉండిపోతున్నారు. మరి కొంత మంది ఆటోలను ఆశ్రయిస్తున్నారు. శ్రీహరిపురం తదితర ప్రాంతాల్లో వివిధ పరిశ్రమల కార్మికులు, విద్యార్థులు వస్తున్న సమయం ఒకటే కావడంతో ఈ పరిస్థితి తలెత్తుతోంది. అధికారులు, పాలకులు స్పందించి ఉదయం, సాయంత్రం వేళల్లో అదనపు సర్వీసులు నడపాలని కోరుతున్నారు.

పొంచి ఉన్న ప్రమాదం



ములగాడ మలుపు వద్ద వంతెనపై లేని రక్షణగోడ

ఫోకస్

మల్కాపురం: జీవీఎంసీ 58వ వార్డు ములగాడ గెడ్డపై నిర్మించిన వంతెన రక్షణ గోడలు దెబ్బతిన్నాయి. ఈ వంతెనపై వాహనదారులు ప్రయాణం చేసేటప్పుడు అదుపు తప్పితే ప్రమాదాలు సంభవించకుండా రక్షణ గోడ నిర్మించారు.అయితే ఇటీవల ఎడమ వైపు రక్షణ గోడ కూలిపోయింది. దీంతో ప్రయాణం ప్రమాదకరంగా మారింది. సమస్యను అధికారులకు నివేదించినా పట్టించుకోవడం లేదని స్థానికులు ఆరోపిస్తున్నారు. ఈ వంతెనపై ప్రయాణం సాగించేందుకు వాహనదారులు భయాందోళన వ్యక్తం చేస్తున్నారు.

సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలి



సీజనల్ వ్యాధులపై ప్రజలకు అవగాహన కలిగిస్తున్న సిబ్బంది

సింథియా: డెంగ్యూ, మలేరియా, చికెన్‌గున్యా తదితర సీజనల్ వ్యాధుల పట్ల అప్రమత్తంగా ఉండాలని 62వ వార్డు శానిటరీ ఇన్‌స్పెక్టర్ నవరత్నం సూచించారు. జీవీఎంసీ మలేరియా విభాగం ఆధ్వర్యంలో శుక్రవారం త్రినాథపురం కూడలిలో సీజనల్ వ్యాధులపై ప్రజలకు అవగాహన కల్పించారు. శానిటరీ ఇన్‌స్పెక్టర్ నవరత్నం సీజనల్ వ్యాధుల నివారణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. పరిసరాల పరిశుభ్రతే ఆరోగ్యానికి భద్రత అనే విషయాన్ని ప్రతీ ఒక్కరూ గుర్తుంచుకోవాలన్నారు. దోమల నియంత్రణ కోసం శ్రమిస్తున్న అధికార యంత్రాంగానికి ప్రజలంతా సహకరించాలన్నారు. పరిసరాల్లో నీటి నిల్వలు లేకుండా చూసుకోవడంతో పాటు ఇంటిలోని ట్యాంకులు, కుండీలను వారానికి ఒక రోజు శుభ్రపర్చడం ద్వారా దోమల వృద్ధిని అరికట్టవచ్చునన్నారు. గృహాల్లో లభ్యమయ్యే చెత్తను రోడ్లపై, కాలువల్లో వేయకుండా పారిశుధ్య సిబ్బందికి అందించాలని కోరారు. పర్యావరణానికి హానికరమైన ప్లాస్టిక్ వినియోగానికి చెక్ పెట్టాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో వార్డు మలేరియా సూపర్‌వైజర్ దుల్లా శ్రీనివాసరావు, శానిటరీ సెక్రటరీ ఆశాబీ, మలేరియా సిబ్బంది పొడుగు రత్నం, నీలాపు దేవి, డి.రామారావు, సేనాపతి తులసి పాల్గొన్నారు.

క్రీడా మైదానంలో మౌలిక సౌకర్యాలు



అధికారులకు సూచనలిస్తున్న ఎమ్మెల్యే గణబాబు

విశాఖ విద్య: గోపాలపట్నం జెడ్పీ హైస్కూల్ క్రీడా మైదానంలో మౌలిక సౌకర్యాల కల్పనకు చర్యలు తీసుకుంటున్నట్లు ఎమ్మెల్యే గణబాబు చెప్పారు. జీవీఎంసీ అధికారులతో కలసి శుక్రవారం హైస్కూల్‌లో పర్యటించారు. క్రీడా మైదానంలో 400 మీటర్ల రన్నింగ్ ట్రాక్ అదే విధంగా వాకర్స్‌తో పాటు క్రీడాకారుల కోసం వ్యాయామ పరికరాలు ఏర్పాటు కోసం ప్రతిపాదనలు సిద్ధం చేయాలన్నారు. వర్షాకాలంలో నీటి నిల్వలు లేకుండా తీసుకోవాల్సిన చర్యలతో పాటు స్కేటింగ్ గ్రౌండ్ నిర్మాణానికి ప్రణాళిక సిద్ధం చేయాలని అధికారులను ఆదేశించారు. ఆయన వెంట డీఈ ప్రవీణ్ కుమార్ ,ఏఈ వెంకటలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

10, 11 తేదీల్లో 'విద్యార్థి ఫెస్ట్'



పోస్టర్ ఆవిష్కరిస్తున్న ఏయూ వీసీ శశిభూషణరావు, ఎస్ఎఫ్ఐ సభ్యులు

విశాఖ విద్య: ఆంధ్ర విశ్వవిద్యాలయంలో ఎస్ఎఫ్ఐ కమిటీ ఆధ్వర్యంలో డిసెంబర్ 10, 11 తేదీల్లో నిర్వహించబోయే విద్యార్థి సాంస్కృతిక కళా ప్రదర్శనల పోస్టర్‌ను శుక్రవారం వీసీ ఆచార్య జి.శశిభూషణరావు ఆవిష్కరించారు. విద్యార్థి ఫెస్ట్ పేరిట దీనిని నిర్వహిస్తున్నట్లు ఎస్ఎఫ్ఐ కమిటీ అధ్యక్ష, కార్యదర్శులు హర్షిత్, వెంకటరమణ తెలిపారు. ఏయూ వీసీ మాట్లాడుతూ విద్యార్థుల కళా ప్రతిభను ప్రదర్శించడానికి ఇదో మంచి వేదికగా నిలుస్తుందన్నారు. సాంస్కృతిక రంగంలో ఆసక్తి గల విద్యార్థులు ఈ వేదికలో పాల్గొని తమ ప్రతిభను పరిచయం చేసుకోవాలని సూచించారు. కళ, సంగీతం, నృత్యం, వక్తృత్వం, ఇతర సాంస్కృతిక ప్రదర్శనల్లో పాల్గొనడం ద్వారా తమ కళాత్మక పటిమను పెంపొందించుకునే అవకాశం ఉంటుందన్నారు. ఎస్ఎఫ్ఐ ఆంధ్ర విశ్వవిద్యాలయ కమిటీ ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తూ, విద్యార్థుల్లో సాంస్కృతిక చైతన్యాన్ని పెంపొందించి, వారి వ్యక్తిత్వ వికాసానికి కూడా మద్దతు ఇవ్వాలని భావిస్తోందని కమిటీ బాధ్యులు వెంకటరమణ, హర్షిత్ తెలిపారు. కార్యక్రమంలో ఏయూ ఎస్ఎఫ్ఐ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

స్టీల్‌ప్లాంట్ ఉద్యోగులకు సక్రమంగా జీతాలు చెల్లించాలి



స్టీల్‌ప్లాంట్‌లో మోడల్ రూమ్‌ను పరిశీలిస్తున్న అధికారులు

ఉక్కునగరం: స్టీల్‌ప్లాంట్ ఉద్యోగులకు సక్రమంగా జీతాలు చెల్లించాలని స్టీల్‌ప్లాంట్ కార్మిక సంఘాల నాయకులు విజ్ఞప్తి చేశారు. కేంద్ర ఉక్కుమంత్రిత్వశాఖ అదనపు కార్యదర్శి, ఆర్థిక సలహాదారు సుబోద్ కుమార్ సింగ్ శుక్రవారం స్టీల్‌ప్లాంట్ సందర్శించారు. ఈ సందర్భంగా ఉక్కు పరిపాలన భవనంలో కార్మిక సంఘాల నాయకులతో ఏర్పాటు చేసిన సమావేశంలో నాయకులు మాట్లాడుతూ ప్లాంట్ మొదట దశ 3.0 మిలియన్ టన్నుల సామర్థ్యంతో నిర్మించగా ఉద్యోగుల కష్టం వల్ల 3.5 మిలియన్ టన్నుల ఉత్పత్తి సాధించిన విషయాన్ని కార్యదర్శి దృష్టికి తెచ్చారు. రా మెటీరియల్ ఏర్పాటు చేస్తూ పూర్తి ఉత్పత్తి చేయడానికి ఉద్యోగులు సిద్ధంగా ఉన్నారన్నారు. వేతన ఒప్పందం చేయకపోగా ఉన్న ఆర్థిక సదుపాయాల్లో చాలా వాటికి కోత పెట్టారన్నారు. వెంటనే జీతాలు సక్రమంగా చెల్లించేలా ఆదేశాలు జారీ చేయాలన్నారు. అంతకు ముందు ఆదనపు కార్యదర్శి స్టీల్‌ప్లాంట్ ఈడీ (వర్క్స్) బిల్డింగ్‌లోని మోడల్ రూమ్, అవార్డు గ్యాలరీలు సందర్శించారు. కార్యక్రమంలో భాగంగా ప్రధాన ఉత్పత్తి యూనిట్లలో పర్యటించి ఉత్పత్తి ప్రక్రియను పరిశీలించారు.

ఉద్యోగ విరమణ చేసిన పోలీసులకు సన్మానం



ఉద్యోగ విరమణ చేసిన సిబ్బందితో సీపీ శంఖబ్రత బాగ్చి

విశాఖ సిటీ: నగర పోలీస్ శాఖలో విధులు నిర్వర్తించి శుక్రవారం ఉద్యోగ విరమణ చేసిన నలుగురు సిబ్బందిని పోలీస్ కమిషనర్ డాక్టర్ శంఖబ్రత బాగ్చి సన్మానించారు. ఎస్ఐ కె.ధర్మారావు, ఆర్ఎస్ఐ ఎస్.మురళీకృష్ణ, ఏఆర్ఎస్ఐ (వీఆర్) కె.గురయ్యబాబు, హెచ్‌సీ ఆర్.ఎస్.రామచంద్రరావు శుక్రవారం ఉద్యోగ విరమణ చేశారు. ఈ సందర్భంగా సీపీ వారిని కుటుంబ సభ్యులతో సమావేశ మందిరానికి ఆహ్వానించారు. పోలీస్ శాఖలో 40 ఏళ్లకు పైగా సుదీర్ఘ సర్వీస్ చేయడం గొప్ప విషయమన్నారు. సిబ్బందికి పదవీ విరమణ శుభాకాంక్షలు తెలిపి, వారి కుటుంబ సభ్యులు, ఉన్నతాధికారుల సమక్షంలో సన్మానించారు.

బీమాతోనే ధీమా



మాట్లాడుతున్న సంస్థ ప్రతినిధి అనిల్‌కుమార్

విశాఖ లీగల్: న్యాయవాదులకు బీమాతోనే ధీమా ఉంటుందని రాష్ట్ర బార్ కౌన్సిల్ ఉపాధ్యక్షుడు ఎస్. కృష్ణమోహన్ అన్నారు. శుక్రవారం ఉదయం విశాఖ న్యాయవాదుల సంఘం ఆధ్వర్యంలో నేషనల్ ఇన్సూరెన్స్ కంపెనీ, రాష్ట్ర బార్ కౌన్సిల్ సభ్యులు సంయుక్తంగా సమావేశం నిర్వహించారు. న్యాయవాదుల ఆర్థిక పరిపుష్టి కోసం బీమా అవసరమని చెప్పారు. ఇందుకు సంబంధించి నేషనల్ ఇన్సూరెన్స్ కంపెనీ న్యాయవాదులందరికీ మేలు చేకూరే విధంగా తమ కంపెనీ చేయూతనిస్తుందని ఆయన చెప్పారు. సంస్థ ప్రతినిధి అనిల్ కుమార్ మాట్లాడుతూ తమ కంపెనీ ద్వారా దేశంలో ఉన్న న్యాయవాదులు అందరికీ మేలు చేసే బీమా పద్ధతిని అమలు చేస్తున్నట్లు చెప్పారు. న్యాయవాదులు కేవలం రూ. 2,236 రూపాయలు చెల్లిస్తే తమ కంపెనీ ద్వారా 80 ఏళ్లు వచ్చే వరకు బీమా అమలులో ఉంటుందన్నారు. ప్రతి సంవత్సరం కనీస ప్రీమియం చెల్లిస్తే మిగతా మొత్తాన్ని బార్ కౌన్సిల్ చెల్లిస్తుందన్నారు. విశాఖ న్యాయవాదుల సంఘం అధ్యక్షుడు బేవరా సత్యనారాయణ మాట్లాడుతూ న్యాయవాదులందరూ బీమా పథకంలో సభ్యులుగా చేరాలని కోరారు. పథకం అందిస్తున్న సేవలను వివరించారు. 80 ఏళ్ల వరకు న్యాయవాదులు ఈ పథకం ద్వారా లబ్ధి పొందవచ్చని సూచించారు. కార్యక్రమంలో రాష్ట్ర బార్ కౌన్సిల్ సభ్యుడు పి. నర్సింగరావు, న్యాయవాదుల సంఘం కార్యదర్శి డి. నరేష్ కుమార్, న్యాయవాదులు, నేషనల్ ఇన్సూరెన్స్ కంపెనీ ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

కనకమహాలక్ష్మికి క్షీరాభిషేక సేవ

డాబాగార్డెన్స్: బురుజుపేటలో వెలసిన కనకమహాలక్ష్మి అమ్మవారికి శుక్రవారం క్షీరాభిషేక సేవ నిర్వహించారు. ఉదయం 8 నుంచి 9 గంటల వరకు నిర్వహించిన ఈ పూజలో పలువురు ఉభయదాతలు పాల్గొన్నారు. ఈ ప్రత్యేక పూజ ప్రతి శుక్రవారం నిర్వహించనున్నట్టు ఆలయ ఈవో కె. శోభారాణి తెలిపారు. పూజలో పాల్గొనదలిచే భక్తులు రూ.500 చెల్లించిన యెడల పూజకు దంపతులు లేదా ఇద్దరిని అనుమతించనున్నట్టు చెప్పారు. కార్యక్రమంలో ఆలయ ఈవో కె. శోభారాణి, ఏఈవో తిరుమలేశ్వరరావు పాల్గొన్నారు.

నేడు కనకమహాలక్ష్మికి సహస్ర తులసీదళార్చన..

కనకమహాలక్ష్మి అమ్మవారి దేవాలయంలో శనివారం ఉదయం 8 నుంచి 9 గంటల వరకు సహస్ర తులసిపూజ నిర్వహించనున్నారు. పూజలో పాల్గొనదలిచే భక్తులు రూ.1,500 పూజా రుసుం చెల్లించి పాల్గొనవచ్చు.

పోర్టు ఆస్పత్రి టెండర్ అడ్డుకుంటాం



దీక్షలో పాల్గొన్నసీఐటీయూ నాయకులు

తాటిచెట్లపాలెం: పోర్టు హాస్పిటల్ టెండర్ పేరుతో ఎవరొచ్చినా అడ్డుకుని తీరుతామని సీఐటీయూ అధ్యక్షుడు జె.సత్యనారాయణ స్పష్టం చేశారు. పోర్టు ఆస్పత్రి ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా హాస్పిటల్ వద్ద జరుగుతున్న రిలే నిరాహార దీక్షలు 60వ రోజుకు చేరాయి. శుక్రవారం దీక్షలో ఆయన పాల్గొని మాట్లాడుతూ పోర్టు హాస్పిటల్‌ను సొంత నిధులతోనే అభివృద్ధి చేసి నిర్వహించాలన్నారు. సుమారు 40 వేల మంది కార్మికులకు వైద్య సేవలందించే ఆస్పత్రిని ప్రైవేటుకు అప్పగించడం తగదన్నారు. కార్యక్రమంలో సీఐటీయూ నాయకులు కె.సత్యనారాయణ, ఈశ్వరరావు, బి.లక్ష్మణరావు, రామలింగేశ్వరరావు, సిహెచ్.త్రినాథరావు, కె.ఎస్.కుమార్, శ్రీను పాల్గొన్నారు.

'కేంద్రం అసమర్థతే ఉక్కు నష్టాలకు కారణం'

డాబాగార్డెన్స్: కేంద్ర ప్రభుత్వ అసమర్థతే విశాఖ ఉక్కు నష్టాలకు కారణమని, విశాఖ స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా డిసెంబర్ 1న పెద్ద ఎత్తున ధర్నా నిర్వహించనున్నట్టు బహుజన్ సమాజ్ పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు బి. పరంజ్యోతి, ఉత్తరాంధ్ర జోన్ ఇన్‌చార్జి లకే రాజారావు తెలిపారు. ఈ మేరకు శుక్రవారం వీజేఎఫ్ ప్రెస్‌క్లబ్‌లో విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. విశాఖ ఉక్కు కర్మాగారం ప్రైవేటీకరణ జరిగితే దానికి రాష్ట్రంలో ఉన్న టీడీపీ, జనసేన పార్టీలే పూర్తి బాధ్యత వహించాలని, తెలుగు జాతి ఆత్మగౌరవ ప్రతీక అయిన విశాఖ ఉక్కును ప్రైవేట్‌పరం చేయబోమని ప్రధాని మోదీ నుంచి తెలుగు ప్రజలకు స్పష్టమైన హామీని ఇప్పించే బాధ్యత చంద్రబాబు, పవన్ కల్యాణ్‌దే అన్నారు. లేనిచో తెలుగు ప్రజల ఆగ్రహానికి గురి కాక తప్పదని హెచ్చరించారు. ఉక్కు కర్మాగారాన్ని అమ్మేస్తే 50 వేల మంది కార్మికులకు ప్రత్యక్షంగా, 5 లక్షల మందికి పరోక్షంగా నష్టం జరుగుతుందన్నారు. నష్టానికి గురయ్యే వారంతా బహుజన కుటుంబాలకు చెందిన వారేనని, ప్రభుత్వ రంగ సంస్థలు ప్రైవేటీకరణ పేరిట మూసేసి రిజర్వేషన్లు లేకుండా చేయడమే ఈ ప్రభుత్వాల కుట్ర అని పేర్కొన్నారు. ప్రైవేటీకరణ ఆపాలని కోరుతూ బీఎస్‌పీ చేపట్టిన బహుజన ధర్నాలో రాజ్యసభ సభ్యుడు రాంజీ గౌతమ్ పాల్గొంటున్నట్టు తెలిపారు. ఉక్కు సంరక్షణ ఉద్యమంలో కార్మికులు, ప్రజా సంఘాలు, కుల సంఘాల నాయకులు పెద్ద ఎత్తున పాల్గొనాలని పిలుపునిచ్చారు.